# అదే సంగతి

తులసీ బాలకృష్ణ

హైద్రాబాద్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో -

ఓ ఆదివారం-

జనం కిటకిటలాడుతున్నారు.

పైనుంచి ఎక్కడ ఇసుక వదిలినా దాన్ని శిరసా ధరించేంత జనం.

ప్రకాశం కొడుకు బుజ్జిగాడు చెక్క గుఱ్ఱం కావాలంటూ నానా గోల పెట్టేస్తూంటే- వాడి దృష్టి మరల్చడానికి బుజ్జగించి బ్రతిమాలి బామాలి, రెండంటించి యింకా అనేకవిధాల విఫల ప్రయత్నం చేస్తున్నారు. ప్రకాశరావు అతని అర్థభాగం! తమ ప్రయత్నాలన్నీ వీగిపోవడంతో విసిగిపోయారిద్దరూ.

"పోనీ ఒకటి కొని పారెయ్యకూడదటండీ" అంది సీత

"నీ మొహం. ఇంటికి చేరేలోగా వాన్ని ముప్పైరెండు ముక్కలుచేసి పెడతాడు దేభ్యం పీనుగ—నీకేం తెలుసు?" అంటూ భార్యమీద కంయ్‌మన్నాడు ప్రకాశం

ఆ మాటలు విని మళ్ళీ ఎగ్జిబిషన్ ఎగిరిపోయేలా ఏడుపు లంకించుకున్నాడు బుజ్జిగాడు, క్రిందపడి దొర్లేస్తూ.

మఱుగు బరువున నిట్టూర్చాడు ప్రకాశం

ఆపైన "తగలెడతాను పదవరా శని పీనుగా" అంటూ వాడి రెక్క పుచ్చుకుని పైకి లేపి "నువ్విక్కడే వుండవే. వీడికి కొని పెట్టొస్తా" అని భార్యని నిర్దేశించి, సుపుత్రరత్నంతో జనంలో కలిసిపోయి, మరో పది నిమిషాలకు ఒక్కడే చేతులూపుకుంటూ గబగబా తిరిగొచ్చాడు ప్రకాశం. అతని ముఖంలో ఏదో కంగారుంది.

"బుజ్జిగాడేడండీ!!" అంది సీత, కంగారుపడ్తూ.

"ఉన్నాళ్ళే. నడు" అంటూ ఆమె జబ్బుచ్చుకుని. వేరే దిక్కు లాక్కెళ్ళాడామెని.

మతిపోయినట్లయి. "అయ్యె. వాడేడండీ. ఏం జేశారు?" అంది వణికేగొంతుతో ఏడవబోతున్నానని సూచిస్తూ.

"పిచ్చి మొహమా - వాడు నాకూ కొడుకేకదా. మరెందుకా కంగారు? నిశ్చింతగా వుండు" అని. హేపీగా ఇటూ అటూ చూడ సాగాడు.

పిచ్చెక్కినట్లయి. వెనక్కి వెనక్కి చూస్తూ నడుస్తోంది సీత, అయోమయంగా.

పావుగంట గడిచింది.

"యువర్ అటెన్షన్ ప్లీజ్, బుజ్జి అనే




పేరు గల అయిదు సంవత్సరాల వయసున్న ఆకుపచ్చ నిక్కరు, ఎర్ర గళ్ళ చొక్కా తొడుక్కున్న అబ్బాయి తప్పిపోయి, మా వాలంటీర్ల క్యాంపు దగ్గర వున్నాడు. ఆ అబ్బాయి తల్లిదండ్రులు వచ్చి తీసుకువెళ్ళవచ్చు"

మైకులో గట్టిగా అనౌన్స్‌మెంటు వినిపిస్తోంది.

"అయ్యో! బుజ్జిగాడు తప్పిపోయేడంటున్నారేవిటండీ మైకులో. వాలంటీర్ల క్యాంపు దగ్గరున్నాట్ట. పదండి" అంటూ గాభరాపడింది సీత

చిద్విలాసం చిందించాడు ప్రకాశం.

ఆపైన అన్నాడుకదా. "పిచ్చిమొహమా వాళ్ళదగ్గరకు చేరాక అందులో మా అనౌన్స్‌చేశాక, పెద్దాళ్ళెవరోవచ్చి తమ పిల్లల్ని తీసుకువెళ్ళేదాకా, పిల్లల్ని వాళ్ళు వదిలిపెట్టరు. మరేం భయంలేదు. అయినా వాడిగోల భరించలేక, వలంటీర్ల క్యాంపుకి దగ్గర్లో వాణ్ణొదిలిపెట్టి, చాటుగా నుంచుని వాళ్ళు వాణ్ని క్యాంపులోకి తీసుకువెళ్ళేదాకా ఆగాకేకదా నేనొచ్చింది. ఇహ నిశ్చింతగా ఎంజాయ్ చెయ్యొచ్చు మనం. బిళ్ళలూ, బిస్కట్లూ పెడుతున్నారులే ఏడవకుండా ఎగ్జిబిషనంతా చూసి, ఇంటికి పోతూ. వాణ్ణి తీసుకుపోవచ్చు మనం. ఓ కే?"

".... ........ .... ....!!!"